విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 06 జూన్ 2024 8 పేజీలు

సీట్ల మార్పే వైసీపీ కొంప ముంచిందా

- స్థానాల మార్పుపై అసంతృప్తిగానే బరిలోకి దిగిన వైసీపీ
- మంత్రి ఆదిమూలపుతో సహా అన్నా, నాగార్జునరెడ్డి, మేరుగ, బుర్ర అందరూ ఓటమి
- ఒంగోలులో బాలినేనికి ముచ్చెమటలు పట్టించిన ఓటర్లు
- భారీ మెజార్టీతో టీడీపీ నేతల విజయాలు

విశాలాంధ్ర బ్యూరో–ఒంగోలు : ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలిసినోడే నాయకుడు అనే పదానికి అర్థం లేకుండా ఎడా పెడా ఇష్టమొచ్చినట్లు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న ఎమ్మెల్యేలను పక్క జిల్లాలకు, పక్క నియోజకవర్గాలకు మార్చి ఇష్టమొచ్చినట్లు వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వడం ద్వారానే వైసీపీ నేతలకు ఎదురు దెబ్బ తగిలిందా..? లేదా గడిచిన ఐదేళ్లలో ప్రజల సంబంధాలకు వైసీపీకి నేతలు దూరంగా ఉండటం వలనే వైసీపీ ఓటమి చవి చూశారా..? లేక జగన్మోహన్‌రెడ్డి మీద నమ్మకం, విశ్వాసం కోల్పోయారా కారాణాలు ఏవైనప్పటికీ జిల్లాలో వైసీపీ ఘోర పరాభవాన్ని చవిచూసింది. వైసీపీకి కంచుకోటగా ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కేవలం రెండు సీట్లకే వైసీపీ పరిమితం అయ్యింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 175 స్థానాలకు గాను కేవలం 11 స్థానాలకే వైసీపీ పరిమితమైంది. దీనిలో రెండు స్తానాలు ప్రకాశం జిల్లాలో గెలుపొందడం కూడా ఒక రకంగా జిల్లాలో వైసీపీ పట్టు ఉంది అనే దానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 2024 సార్వత్రిక ఫలితాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు అత్యధిక స్థానాల్లో భారీ మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు. వైసీపీకి చెందిన నేతలు మాత్రం ఓటమిపాలయ్యారు. ముఖ్యంగా జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒంగోలు వైకాపా అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి గత ఎన్నికలకు భిన్నంగా ఈ ఎన్నికల్లో పనిచేశారు. ఓటుకు మూడువేలు డబ్బులు, బియ్యం బస్తాలు, కొన్ని ప్రాంతాల్లో మటన్ పంపిణీ, చీరెలు, కుక్కర్లు ఎన్ని తాయిలాలు ఓటర్లకు అందజేసినా భారీ ఓటమిని మూటకట్టుకున్నారు. ఒంగోలు నియోజకవర్గ చరిత్రలో 34100 ఓట్ల తేడాతో ఓడిపోవడం బాలినేని పట్ల ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు. అది కేవలం బాలినేని పట్ల ఉందా లేక ప్రభుత్వంమీద ఉన్న వ్యతిరేకత, ఏదేమైనా బాలినేని భారీ ఓటమి మూటకట్టుకున్నారు. ఆరవసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గతంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. కానీ ఏ ఎన్నికల్లో కష్టపడని విధంగా ఈ ఎన్నికల్లో కష్టపడ్డారు. 120 కోట్లకు పైగా ఒంగోలు నియోజకవర్గంలో ఖర్చుపెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. అయినా ప్రజలు విశ్వసించలేదు. బాలినేనిని చిత్తుచిత్తుగా ఓడించారు. అయితే బాలినేని కొంతకాలంగా వైకాపాలో దాగుడు మూతలాడుతూ కాలం మిగతా 2 లో ...

టీడీపీ నేతల్లో జోష్

- గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద సందడి
- వేలాదిగా శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు, ప్రజలు

విశాలాంధ్ర బ్యూరో–ఒంగోలు : 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసిన తెలుగుదేశం పార్టీ నేతల్లో, నాయకుల్లో ఫుల్ జోష్‌లో ఉన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు గాను టీడీపీ కూటమి అభ్యర్థులు 164 స్థానాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయకేతనం ఎగరవేశారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో దర్శి, యర్రగొండపాలెం మినహాయిస్తే మిగిలిన అన్ని చోట్ల తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో బుధవారం గెలిచిన తెలుగుదేశం పార్టీ ఇళ్ల వద్ద పార్టీ శ్రేణుల జోష్ కన్పిస్తుంది. వారి ప్రియతమ నాయకున్ని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు ఆయా నియోజకవర్గాల్లోని మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చి మిగతా 2 లో ...

యర్రగొండపాలెంలో పట్టు నిలుపుకున్న వైసీపీ 2 లో..

బీజేపీతో స్నేహం ఎప్పటికైనా ప్రమాదమే

- ఇండియా కూటమితోనే దేశ భవిష్యత్తు
- సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర – బాపట్ల : భారతీయ జనతా పార్టీతో స్నేహం చేస్తే ఎప్పటికైనా ప్రమాదమే అని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల ప్రాంతీయ పార్టీల ఉనికి కోల్పోతున్న సంఘటనలు జరుగుతున్నాయన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకుంటున్న పార్టీలను ప్రజలు తిరస్కరిస్తున్నారని ప్రజల నుంచి వ్యతిరేకమైన తీర్పురావటం గమనించాలన్నారు. బిజెపితో పొత్తు పెట్టుకున్నందుకు తమిళనాడులో ఏఐఏడీఎంకే, కర్ణాటకలో జేడిఎస్, మహారాష్ట్ర శివసేన, ఎన్సిపీ, ఒడిశాలో బిజెడీ, పంజాబ్‌లో ఎ.కె ఎ.ఎల్ ఐ.డి.ఎ.ఎల్, కాశ్మీర్లో పిడిపి ఉత్తరప్రదేశ్‌లో బిఎస్పి, ఎపి ఎన్‌ఏడిఏఎల్, అస్సాంలో ఏజీపీ, బెంగాల్లో సీపీఎం, హర్యానాలో జెపిపీ బీహార్లో జెడియు, ఆంధ్రాలో టీడీపీ, వైఎస్ఆర్, జనసేన పార్టీలు బీజేపీతో స్నేహంతో కొనసాగుతున్నాయన్నారు. కొన్ని ప్రాంతీయ పార్టీలు ఘోర అపజయాలు చెందాయన్నారు. ఆ పార్టీల భవిష్యత్ రోజుల్లో ఉనికికే ప్రమాదం అని సింగరకొండ హెచ్చరించారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే భారత రాజ్యాంగం కొనసాగాలంటే అన్ని మతాలు సమ్మేళనంగా కలిసి ఉండాలంటే ఒక్క ఇండియా కూటమితోనే సాధ్యమని ప్రాంతీయ పార్టీలు ఇండియా కూటమితో జతకట్టి స్నేహం చేయాలని సింగరకొండ కోరారు.

రాష్ట్రంలో స్వర్ణ యుగమే

- ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర – మార్టూరు : రాష్ట్రానికి చంద్రన్న పాలనలో స్వర్ణ యుగం రానుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు నియోజకవర్గంలో గతంలో కనీ విని ఎరుగని రీతిలో భారీ మెజారిటీతో ఎమ్మెల్యే ఏలూరి విజయం సాధించడంతో పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే ఏలూరిని పూలమాలలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రజలందరి ఆశలు ఆకాంక్షలకనుగుణగా తెలుగుదేశం ప్రభుత్వం పాలన కొనసాగుతుందన్నారు. రైతాంగ శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాపాలన సాగిస్తామన్నారు. ఇంతటి ఘన విజయాన్ని భారీ మెజారిటీని అందించిన పర్చూరు నియోజకవర్గం ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు.

కిక్కిరిసిన క్యాంపు కార్యాలయం :

ఎమ్మెల్యే ఏలూరికి అభినందనలు తెలియజేయడానికి విచ్చేసిన పర్చూరు నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రజలతో ఏలూరి క్యాంపు కార్యాలయం కిక్కిరిసింది. జన సందోహంతో క్యాంపు కార్యాలయం పండుగ వాతావరణం సంతరించుకుంది. ఎమ్మెల్యే ఏలూరికి శుభాకాంక్షలు తెలిపినందుకు అభిమానులు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. ఏలూరి క్యాంప్ కార్యాలయం నినాదాలతో దద్దరిల్లింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే ఏలూరి విజయం సాధించడంతో సంబరాలు అంబరాన్నంటాయి. స్వీట్లు పంచుతూ టపాసులు కాల్చితో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

చంద్రబాబును కలిసి 'మాగుంట'

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఒంగోలు తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థిగా విజయం సాధించిన మాగుంట శ్రీనివాసరెడ్డి తన తనయుడు మాగుంట రాఘవరెడ్డి బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్తున్న చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన విజయంతో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో భారీ మెజార్టీతో గెలుపొందిన నేపథ్యంలో బాబును కలిసిన మాగుంట శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం మాగుంట ఒంగోలులోని తన కార్యాలయం వద్దకు రాగా జిల్లాలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మాగుంటను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సమిష్టి కృషితో విజయం సాధించాం

కనిగిరి ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర-పామూరు : సమిష్టి కృషితో విజయం సాధించామని, ఈ సమయంలో బొల్లా మాల్యాద్రి చౌదరి మన మధ్య లేకపోవడం బాధాకరమని, ఈ విజయం ఆయనకు అంకితం చేస్తున్నానని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక శేష మహ థియేటర్ లో నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా పరిచయ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ నేను ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఐదు సంవత్సరముల కాలములో పూర్తి చేసి 2029 ఎన్నికలకు పోతానన్నారు. పామూరు పట్టణంలోని ప్రతి బూతులో మెజార్టీ ఇచ్చిన ఓటర్లకు నాయకులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టించి పని చేసిన కార్యకర్తలు నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. అసమర్థ వైసిపి ప్రభుత్వం మాదిరిగా కాకుండా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధిని సంక్షేమాన్ని రాష్ట్రంలో పరుగులు పట్టిస్తామన్నారు. విజయానికి కృషి చేసిన తెలుగుదేశం పార్టీ, బిజెపి, జనసేన కార్యకర్తలందరికీ, ముఖ్యముగా ఇంటింటా తిరిగి ఓటు అర్థించిన తెలుగు మహిళలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షులు ఏలూరు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ డి వి మనోహర్, అదుసుమల్లి ప్రభాకర్ చౌదరి, ఎంపీటీసీ బొల్ల నరసింహారావు చౌదరి, బిజెపి నాయకులు కొండిశెట్టి వెంకట రమణయ్య, జనసేన నాయకులు రహీముల్లా, యారవ శ్రీనివాసులు, పందిటి హరీష్, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు ఇరి కోటిరెడ్డి, వీరభద్రపురం సర్పంచ్ పువ్వాడ జయమ్మ, మద్దిశెట్టి రమాదేవి, పువ్వాడి రామకృష్ణ, రామారావు, వెంకటేశ్వర్లు, షేక్ ఖజా రహమతుల్లా, షేక్ రంతుల్లా పాల్గొన్నారు.

దర్శి నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు : శివప్రసాదరెడ్డి

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గంలో జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థిగా నాకు ఘన విజయాన్ని చేకూర్చిన దర్శి నియోజకవర్గం ప్రజలకు శివప్రసాదరెడ్డి ధన్యవాదములు తెలియ జేశారు. అందరికి అందుబాటులో ఉండి సేవచేస్తానని అన్నారు.

యర్రగొండపాలెంలో పట్టు నిలుపుకున్న వైసీపీ

తాటిపర్తి చంద్రశేఖర్ గెలుపు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పై వైసీపీ నుంచి పోటీ చేసిన తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో విజయం సాధించారు. టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు పై 5477 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ విజయం సాధించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో 207214 మంది ఓటర్లు ఉండగా 185242 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 89.40 శాతం ఓటింగ్ నమోదైంది. వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ కు 90964 ఓట్లు పోలుకాగా, టిడిపి కోటమీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబుకు 85487 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బూదాల అజితారావుకు 2166 ఓట్లు, నోటాకు 2222 ఓట్లు, బీఎస్పీ నుంచి కోట పిచ్చయ్యకు 1327 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి కే జయరాంకు 325 ఓట్లు, సిహెచ్ వెంకటేష్ కు 82 ఓట్లు, టి ఇజ్రీరాణి కి 81 ఓట్లు, డి చంద్రబాబు కు 137 ఓట్లు, ఎం కృపయ్యకు 161 ఓట్లు, డి వెంకటేశ్వర్లు కు 119 ఓట్లు, వి ఎలియాకు 92 ఓట్లు, కె రవి 147 ఓట్లు, టి జాన్సన్ 168 ఓట్లు పోలయ్యాయి.

ఒంగోలు పార్లమెంటు ప్రజలకు కృతజ్ఞతలు

ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : 2024 సాధారణ ఎన్నికలలో నన్ను - నా సహచర అసెంబ్లీ అభ్యర్థులను ఆదరించి తెలుగుదేశం, జనసేన మరియు బీ.జే.పి. పార్టీలకు అఖండ విజయాన్ని చేకూర్చిన ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఓటరు మహాశయులకు, ప్రజలందరకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీ నాయకులు మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలసి కూటమిగా ఏర్పడి పోటీ చేసిన 2024 సార్వత్రిక ఎన్నికల కార్యక్రమాలలో ఎండలనక, రాత్రిపగలనక పాల్గొని, మమ్ములను ఆదరించి, విశేష కృషి చేసి, సహచర అసెంబ్లీ అభ్యర్థులు, ఒంగోలుకు దామచర్ల జనార్ధన్ రావు కి, కొండపికి డోలా బాల వీరాంజనేయస్వామి కి, కనిగిరికి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కి, గిద్దలూరుకు ముత్తుముల అశోక్ రెడ్డి కి మరియు మార్కాపురానికి కందుల నారాయణ రెడ్డి కి అఖండ విజయాన్ని అందించినందుకు పార్లమెంటు ఓటరు మహాశయులకు, తెలుగుదేశం, జనసేన, బీ.జే.పి. పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, మాగుంట అభిమానులకు, శ్రేయోభిలాషులకు, ఉద్యోగులకు, ప్రజలకు పేరు పేరున సహచర అసెంబ్లీ అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేయుచున్నామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధితోపాటు ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం సహచర శాసనసభ్యులు తప్పక కృషి చేస్తామని మీకు తెలియజేస్తున్నామన్నారు.

వైసీపీ అధ్యక్ష పదవికి రాజీనామా

విశాలాంధ్ర-వెలిగండ్ల : వైయస్సార్ పార్టీ వెలిగండ్ల మండల అధ్యక్షులుగా పనిచేస్తున్న గజ్జల వెంకటరెడ్డి రాజీనామా లేఖను ప్రకాశం జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డికి పంపినట్లు బుధవారం తెలిపారు. ఈ క్రమంలో ఆయన మే నెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వెలిగండ్ల మండలంలో మెజారిటీని తీసుకురాలేక పోయినందున తన అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

సీట్ల మార్పే వైసీపీ కొంప ముంచిందా

(మొదటిపేజీ తరువాయి)

గడిపారు. కొన్ని రోజుల పాటు ముఖ్యమంత్రిపైనే అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరిగింది. చివరకు వైకాపా నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. మరోపక్క యర్రగొండపాలెం శాసనసభ్యులుగా ఉన్న మంత్రి ఆదిమూలపు సురేష్‌ను యర్రగొండపాలెంలో టిక్కెట్టు ఇవ్వకుండా కొండేపి నియోజకవర్గం నుంచి వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి బరిలో దించారు. అక్కడ నుంచి బరిలో దిగడానికి ఇష్టం లేకపోయినా జగన్మోహన్‌రెడ్డి మాట కాదనలేక బరిలో దిగారు. సురేష్ కూడా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బాల వీరాంజనేయస్వామి చేతిలో ఘోర పరాభవాన్ని చవిచూడాల్సి వచ్చింది. యర్రగొండపాలెం నుంచి సురేష్ పోటీ చేసివుంటే గెలిచే అవకాశాలు ఉండేవని అనుకుంటున్నారు. అయితే సురేష్ కేవలం నియోజకవర్గం మార్పు వలనే ఓటమి చవిచూడాల్సి వచ్చింది అనే అభిప్రాయంలో ఆయన కూడా ఉన్నట్లు సమాచారం. అదే విధంగా కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న బుర్ర మధుసూదన్ యాదవ్‌ను, గిద్దలూరు ఎమ్మెల్యేగా ఉన్న అన్నా రాంబాబు, మార్కాపురం ఎమ్మెల్యేగా ఉన్న నారాయణరెడ్డిని ఆయా నియోజకవర్గాల్లో టిక్కెట్టు ఇవ్వకుండా బుర్ర మధుసూదన్ యాదవ్‌కు కందుకూరు నియోజకవర్గాన్ని, అన్నా రాంబాబుకు మార్కాపురం, నారాయణరెడ్డికి గిద్దలూరుకు కేటాయించారు. దీన్ని కూడా స్థానిక ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. దీంతో వీరు ముగ్గురు కూడా ఓటమి తప్పలేదు. స్థానికంగానే వారు నియోజకవర్గాల నుంచి బరిలో దిగివుంటే ఫలితాలు మరోరకంగా ఉండేవని అందరూ భావిస్తున్నారు. ముఖ్యంగా కనిగిరి నియోజకవర్గంలో ఒక మండల జడ్పీటీసీ అభ్యర్థిని తీసుకొచ్చి ఎమ్మెల్యేగా బరిలో దించారు. ఎమ్మెల్యేగా బరిలో దించే అభ్యర్థికి ఎమ్మెల్యేగా పోటీ చేసే అర్హత ఉందా లేదా అనే ఆలోచన కూడా లేకుండా నన్ను చూసి ఓట్లు వేస్తారని, ఓవర్ కాన్ఫిడెంట్‌లో జగన్మోహన్‌రెడ్డి వ్యవహరించడం వలన కనిగిరి నియోజకవర్గం నుంచి బరిలో దిగిన దద్దాల నారాయణ యాదవ్ ఓటమి చెంది తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి విజయకేతనం ఎగురవేశారు. సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న టీజేఆర్ సుధాకర్‌బాబును కాదని బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గానికి చెందిన మేరుగు నాగార్జునను సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి బరిలో దించారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. చేసేది ఏమీ లేక ఎన్నికలకు దూరంగా ఉన్నాడు. ఆ నియోజకవర్గం నుంచి బరిలో దిగిన నాగార్జున ఘోర పరాభవాన్ని చవిచూడాల్సి వచ్చింది. అక్కడ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ విజయకేతనం ఎగురవేశారు. మరీ ముఖ్యంగా ఒంగోలు వైసీపీ పార్లమెంట్ అభ్యర్థిగా ఉన్నా మాగుంట శ్రీనివాసరెడ్డిని కాదని చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని తీసుకొచ్చి ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దించారు. దీంతో అప్పటి వరకు వైకాపా ఎంపీగా ఉన్న మాగుంట తెలుగుదేశం పార్టీలో చేరి పోటీ చేసి విజయం సాధించారు. ఇలా జగన్మోహన్‌రెడ్డి అభ్యర్థులను మార్చడం, ఓవర్ కాన్ఫిడెంట్‌గా ఎన్నికలకు వెళ్లడమే ఓటమికి గల కారణాలుగా కొన్ని అంశాలుగా చెప్పుకోవచ్చు. మొత్తం మీద వైకాపాకు కంచుకోటగా ఉన్న గిద్దలూరు, మార్కాపురం కనిగిరి వంటి నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడింది.

టీడీపీ నేతల్లో జోష్

(మొదటిపేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గడిచిన ఐదేళ్లలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న తెలుగుదేశం పార్టీ నేతలు ఒక్కసారిగా సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలో ఫుల్ జోష్ కన్పిస్తుంది. ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ జరుగుతుంది. తెలుగుదేశం పార్టీ కూటమి 164 సీట్లలో విజయం సాధించడం అందరికీ ఆశ్చర్యం కల్గిస్తున్నా, జగన్మోహన్‌రెడ్డిపై ఇంతటి వ్యతిరేకత ఉందనేది అర్థం అవుతుంది. మొత్తం మీద బుధవారం ఉదయం నుంచి ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ నివాసంతో పాటు పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసేందుకు కొత్తపట్నం, ఒంగోలు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఉగ్రను పార్టీ శ్రేణులు అభినందనలతో ముంచెత్తారు. కేక్‌ను కట్‌చేసి తినిపించారు. పూల మాలలు, బుకేలో ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఇంటి వద్ద సందడి నెలకొంది. బేస్తవారిపేట, కంభం, గిద్దలూరు, కొమరోలు మండలాల నుంచి అత్యధికంగా జనం తరలివచ్చి ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హోరా హోరీగా జరిగిన ఈ ఫైట్‌లో ముత్తుముల అశోక్‌రెడ్డి స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి గెలవడం, టీడీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. మార్కాపురంలో కూడా కందుల నారాయణరెడ్డి ఇంటివద్ద సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు కందుల నారాయణరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, కొండేపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి, దామచర్ల సత్యను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకుంది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాల్లో 10 చోట్ల విజయకేతనం ఎగురవేశారు. దీంతో ఆ పార్టీ నేతలు సంబరాల్లో మునిగి తేలుతున్నారు.

పచ్చిరొట్ట వేసుకోవడం ద్వారా భూసారం

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలోని పెద్దవరం గ్రామంలో బుధవారం ఎఫర్ట్ సంస్థ మరియు రిలయన్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మిర్చి రైతులకు పచ్చి రొట్టపై అవగాహన కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. మాట్లాడుతూ భూమిలో పచ్చి రొట్టెను చల్లి భూమి అంతా కలియదున్నాలి. వర్షాకాలం సమయంలో భూమిని పంట వేసుకునుటకు సిద్ధం చేసుకోవాలి ప్రీ మాన్సూన్ డ్రై పోయింగును పాటించి పురుగుమందులను తగ్గించు కుంటూ సేంద్రియ ఎరువులను వేసుకోవాలి. ప్రతి గ్రామములో రైతు భరోసా కేంద్రం నందు ప్రభుత్వం వారు సబ్సిడీకి 440కి అందిస్తున్నారని అలాగే ఎఫర్ట్ నుండి 220 రూపాయలు మీరు తీసుకునేందుకు సపోర్టును అందించుతుందని తెలియజేశారు. అనంతరం పర్యావరణ దినోత్సవ కార్యక్రమం చేయడం జరిగింది. ఎఫెక్ట్ టీం జెస్సి గ్లోరీ రిసోర్స్ పర్సన్ లక్ష్మీ రెడ్డి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సౌమ్య లత గ్రేస్ ఎఫ్ ఎ సుబ్బారావు వెంకట శేషయ్య బాలకోటయ్య చెంచయ్య మల్లేశ్వరి నాసరమ్మ రవికుమాం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందుల నివాసానికి భారీగా చేరుకున్న టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర-మార్కాపురం : నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన కందుల నారాయణరెడ్డి నివాసానికి టిడిపి శ్రేణులు బుధవారం సాయంత్రం భారీ సంఖ్యలో చేరుకున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కందుల నారాయణరెడ్డికి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. అనంతరం కందుల నారాయణరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఊరేగింపుగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి చేరుకున్నారు. ఆలయంలో నూతన ఎమ్మెల్యే కందులకు ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కందుల ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, టిడిపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవు

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని దర్శి సబ్ డివిజన్ మలేరియా అధికారి బసవా రెడ్డి అన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల శంకరాపురం గ్రామంలో బుధవారం వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తే దోమల నివారణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కే ఏ రాజు, హెల్త్ అసిస్టెంట్ ఎస్ కే యం యం సుభాని, సచివాలయ ఏఎన్ఎం టీ ప్రియదర్శిని, గ్రామ సెక్రెటరీ సుబ్బారెడ్డి, ఎం ఎల్ హెచ్ పి,సిహెచ్ఓ కోడూరి శశి, సచివాలయ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

మంచి నీటి చెరువు ట్యాంకులో శిశువు మృతదేహం

విశాలాంధ్ర-కురిచేడు : కురిచేడు మండలానికి మంచి నీటిని అందించే చెరువు ట్యాంకులో బుధవారం శిశువు మృతదేహం నీటిపై తేలాడుతూ కనిపించింది. శిశువు మృతదేహం చూసినవారు సుమారు రెండు రోజుల క్రితం జన్మించినట్టుగా ఉన్నది గుర్తుతెలియని మహిళ రెండు రోజుల క్రితం జన్మనిచ్చి గుట్టు చప్పుడు కాకుండా ట్యాంక్‌లో పడేసి ఉంటారని గ్రామస్తులు అంటున్నారు. ఏ తల్లి అయినా నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చి తల్లి పొత్తిళ్లలో ఉండవలసిన బిడ్డ మంచినీటి చెరువులో పడవేయటం ఆ తల్లికి ఎలా చేతులు వచ్చాయని అందరూ నిందిస్తున్నారు.

కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అండగా ఉంటా

ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-కనిగిరి : సార్వత్రిక ఎన్నికల్లో నా విజయానికి కష్టపడి పనిచేసి మెజార్టీ తెచ్చిన నాయకులను, కార్యకర్తలకు ఎప్పటికీ అండగా ఉంటానని ఎన్నికల్లో గెలుపొందిన కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కోకుడా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం అమరావతి మైదానంలో ఉగ్రకు అభినందనలు తెలపటానికి వచ్చిన వందల మంది కార్యకర్తలతో మాట్లాడారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కూటమి నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేశారని చెప్పారు. హనుమంతునిపాడు, వెలిగండ్ల, సిఎస్పురం, పామూరు, పీసీ పల్లి, కనిగిరి మండలాల్లో మంచి మెజార్టీ తెచ్చినందుకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ ఆయువుపట్టు లాగా మారిందని మున్సిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో ఉంటూ పని చేయని నాయకులు, కార్యకర్తలకు పరోక్షంగా చురకలు అంటించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలకు, మహాశక్తి మహిళలకు ప్రత్యేకంగా పరిశీలించారు. కనిగిరి నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడు అమరావతి మైదానం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కనిగిరి నియోజకవర్గంలో బూత్ స్థాయిలో అత్యధిక మెజార్టీ తెచ్చిన నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అనంతరం కార్యకర్తలు భారీ స్థాయిలో ఉగ్రాకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు గుడిపాటి ఖాదర్, జిల్లా మాజీ కో ఆప్షనల్ సభ్యులు షేక్ షరీఫ్, సానికొమ్ము తిరుపతిరెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, కుందూరు తిరుపతిరెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతిని ప్రేమిద్దాం - ఆరోగ్యంగా ఉందాం

విశాలాంధ్ర-కనిగిరి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కనిగిరి పట్టణం లోని పులి వెంకట రెడ్డి పార్కు నందు పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకం అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ రమేష్ బాబు మాట్లాడుతూ మానవుడు అభివృద్ధి క్రమంలో వెళ్తూ ప్రకృతిని కొల్లగొడుతూ భూతాపం, కాలుష్యం పెరగడానికి కారణమౌతున్నారని అన్నారు. ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన మన భూమి మన భవిష్యత్ అనే నినాదంతో మనమందరం పర్యావరణను కాపాడుకోవాలని అన్నారు.బజారుకు వెళ్లేటప్పుడు ఇంటి నుంచి సంచీలు తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలని విహారయాత్రలకు వెళ్ళినప్పుడు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చెత్తకుండీలో వేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటడం అలవాటు చేసుకోవాలని మీ బంధుమిత్రుల ఇళ్లల్లో పుట్టిన రోజులు, పెళ్లి రోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో వారికి పూల మొక్కను కానుకగా ఇవ్వాలని మీరు కూడా అలాంటి కానుకలనే స్వీకరించాలని అవగాహన కలిగించారు.మన పిల్లలకు చిన్న వయసు నుంచే పర్యావరణ ప్రాధాన్యతను తెలియజేసి ప్రకృతి ప్రేమికులుగా మార్చాలని ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూస్తూ ఉండకుండా,మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ఇంట్లో ఏ సి పెట్టుకుంటే గది మాత్రమే చల్లగా ఉంటుందని అదే ఇంట్లో ఒక మొక్క నాటితే గది ఇళ్ల ఇంటి ఆవరణ మొత్తం చల్లగా ఉంటుందని ఈ రోజు నువ్వు నాటిన మొక్క భావి తరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ జీవన్ అండ్ జిడికె ఫౌండేషన్ నవ కుమార్, విద్యార్థులు, న్యాయ సేవాధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధి దాతలు సాయం అభినందనీయం

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

విశాలాంధ్ర-కనిగిరి : మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం సమస్య పరిష్కారంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ 14వ వార్డులోని మహాలక్ష్మమ్మ చెట్టు ప్రాంతంలో పర్యటించి ప్రజలు సమస్యలు చైర్మన్ దృష్టికి తేగా ఆ ప్రాంతంలోని ఆర్యవైశ్య నాయకులు కొప్పరపు సత్యనారాయణ తన సొంత నిధులతో లాడే సాహెబ్ వీధికి వెళ్లే చప్టాను సరి చేయించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తానని ముందుకు రావడం హర్షణీయమని అన్నారు.అలాగే ఇంకా దాతలు ముందుకు వచ్చి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరినారు. ఇంతకు మునుపే మంజూరై ఉన్న లాడే సాహెబ్ వీధి రోడ్డు మరియు మహాలక్ష్మి చెట్టు వీధిలోని రోడ్డు మంజూరు కాగా వాటిని త్వరలోనే పనులు పూర్తి చేయించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు బచ్చు రమేష్, కొలిపర్తి మారుతి, వెలుగూరి చంద్రశేఖర్, పేర్ల రమేష్, కోట సురేష్, కోట రాజా, నార్లపాటి మల్లికార్జున, కొలిపర్తి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు భవానికి సూర్యశ్రీ ట్రస్ట్ ఆర్థిక సాయం



విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు సంతపేటకు చెందిన వృద్ధురాలు షేక్.భవాని భర్త లేదు ఉన్న కుమారుడు భాష ఆక్సిడెంట్‌లో అనారోగ్యానికి గురి అయ్యాడు. ఆమె కుటుంబం కష్టాల్లో ఉన్న దశలో సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ బాషాను సంప్రదించగా ప్రవాస భారతీయుడు కిరణ్ తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జ్ఞాపకార్థం ప్రతినెల వారి కుటుంబ పోషణకు వైద్య ఖర్చులకు 8000 ఆర్థిక సాయం గత సంవత్సరం నుంచి సర్దార్ ద్వారా ప్రతినెల 8వేలు చొప్పున ఇప్పటికీ 80 వేల రూపాయలు అందించారు. బుధవారం రెండు నెలలకు సరిపడా 16 వేల రూపాయల ఆర్థిక సహాయం ట్రస్ట్ చైర్ పర్సన్ షేక్ షహనాజ్ ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు ద్వారా అందజేయడం అయినది. మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ వృద్ధురాలు భవానికి కుటుంబ పోషణకు కుమారుడు భాష వైద్య ఖర్చులకు గత సంవత్సరం నుంచి ప్రతినెలా ఎనిమిది వేల రూపాయలు కిరణ్ ప్రవాస భారతీయుడు మానవత్వంతో వృద్ధురాలు భవానీ బతికున్నంత కాలం ప్రతినెలా అందిస్తానని చెప్పి గొప్ప మనసు చాటుకున్నారని అన్నారు. ఈ సేవ కార్యక్రమంలో చిక్కాల కిరణ్ కుమార్ ట్రస్టులోని దివ్యాంగులు పాల్గొన్నారు.

‘ఉగ్ర’కు అభినందనలు తెలిపిన ఆర్యవైశ్యులు

విశాలాంధ్ర-కనిగిరి : సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించిన కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి బుధవారం అమరావతి మైదానంలో కనిగిరి ఆర్యవైశ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం ఉగ్ర నరసింహారెడ్డి తండ్రి చిన్న నరసారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు పాలనలో రాష్ట్ర అభివృద్ధితోపాటు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కనిగిరి నియోజకవర్గ ప్రజలకు ఉగ్ర నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కనిగిరి ఆర్యవైశ్యులు కోట వెంకట సుధారాణి, అంగులూరి రమ్య, కోట సురేష్, అంగులూరి అనిల్ , తట్టవర్తి ధనలక్ష్మి, అచ్యుతలక్ష్మి, పైడిమర్రి నందిని, బోర్ల గడ్డ శైలజ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బాలాజీ

విశాలాంధ్ర-మార్కాపురం : పర్యావరణాన్ని పెంపొందించుకునేందుకు అలాగే స్వచ్ఛమైన గాలిని, ప్రకృతిని ఆస్వాదించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఎక్కడికక్కడ మొక్కలను నాటాలని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం. బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం స్థానిక కోర్టు ప్రాంగణంలో ఆయన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. బాలు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూపని కాశయ్య, కార్యదర్శి యద్దనపూడి అనిల్ కుమార్, అడ్వకేట్స్ పాల్గొన్నారు.

కత్తి యశ్వంత్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : తెలుగుదేశం పార్టీ అభిమాని కత్తి యశ్వంత్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సంతనూతలపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే బియన్ విజయ్ కుమార్ తమ్ముడు అనిల్ ఉప్పుగుండూరు గ్రామానికి వచ్చి కత్తి యశ్వంత్ పార్థీవదేహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తెలుగు దేశం పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు. వారి వెంట టిడిపి మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు, కనగాల శ్రీనివాసరావు, జనసేన నాయకులు పెంట్యాల కోటేశ్వరరావు, తిరుమలశెట్టి శ్రీనువాసరావు, బాలిశెట్టి నాగేశ్వరరావు, కొలకలూరి నాగార్జున, కొంజేటి ధనుష్, పెంట్యాల శ్రీనివాసరావు టిడిపి నాయకులు ఉన్నారు.

మెజార్టీలో ‘దామచర్ల’కు బ్రహ్మరథం

- ప్రతి రౌండ్‌లో హవా కొనసాగించిన ‘దామచర్ల’
- జిల్లాలోని అత్యధిక మెజార్టీ 34,100 సాధించిన వైనం

విశాలాంధ్ర-ఒంగోలు : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యధిక మెజార్టీ 34 వేల 100 ఓట్లతో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు టిడిపి అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్థన్ రావు తన సమీప ప్రత్యర్థి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసుల రెడ్డిపై ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపులో పోస్టల్ బ్యాలెట్ నుండి, ఈవీఎంల వరకు ప్రతి రౌండ్లో తన హవా కొనసాగించారు. దామచర్ల ముందు నుండి చెప్పిన విధంగానే ఓటర్ల విజయాన్ని కట్టబెట్టారు. అభివృద్ధిని చూసి ఓటేయండి అని నినాదానికి ప్రజల నుండి అనుష స్పందన రావడంతో పాటు, ఓట్లు కూడా అదే విధంగా వచ్చాయి. దామచర్ల జనార్దన్ రావుకు పోస్టల్ బ్యాలెట్‌లో 2,892 ఓట్లు రాగా 1980 ఓట్లు వచ్చాయి. అలాగే తొలి రౌండులో దామచర్లకు 6558 ఓట్లు రాగా, బాలినేనికి 4145ఓట్లు వచ్చాయి. రెండవ రౌండ్లో దామచర్లకు 4792 ఓట్లు రాక బాలినేనికి 4008 ఓట్లు వచ్చాయి. మూడవ రౌండ్ లో దామచర్లకు 5860 ఓట్లు రాగా, బాలినేనికి 5035 ఓట్లు వచ్చాయి. నాల్గవ రౌండులో దామచర్లకు 5655 ఓట్లు రాగా, బాలినేనికి 5100 ఓట్లు వచ్చాయి. ఐదవ రౌండ్లో దామచర్లకు 6750 ఓటు రాగా బాలినేనికి 4644 ఓట్లు వచ్చాయి. ఆరవ రౌండ్ లో దామచర్లకు 6982 ఓట్లు రాగా, బాలినేనికి 5171 ఓట్లు వచ్చాయి. అలాగే ఏడవ రౌండ్లో దామచర్లకు 6414 ఓట్లు రాగా, బాలినేనికి 3630 ఓట్లు వచ్చాయి. అలాగే ఎనిమిదవ రౌండ్లో దామచర్లకు 7164 ఓట్లు రాగా బాలినేనికి 4520 ఓట్లు వచ్చాయి. తొమ్మిదవ రౌండ్లో దామచర్లకు 6182 ఓట్లు రాగా, బాలినేనికి 5492 ఓట్లు వచ్చాయి. పదవ రౌండ్లో దామచర్లకు 7950 ఓట్లు రాగా, బాలినేనికి 4056 ఓట్లు వచ్చాయి. 11వ రౌండ్ లో దామచర్లకు 7156 ఓట్లు రాగా, బాలినేనికి 3203 ఓట్లు వచ్చాయి. అలాగే 12వ రౌండ్లులో దామచర్లకు 6784 ఓట్లు రాగా, బాలినేనికి 4310 ఓట్లు వచ్చాయి. అలాగే 13వ రౌండ్‌లో దామచర్లకు 619 ఓట్లు రాగా, బాలినేనికి 3954 ఓట్లు వచ్చాయి. అలాగే 14వ రౌండ్ లో దామచర్లకు 6,515 ఓటు రాగా, బాలినేనికి 4685 ఓట్లు వచ్చాయి. 15వ రౌండ్ లో దామచర్లకు 5478 ఓట్లు రాగా, బాలినేనికి 4987 ఓట్లు వచ్చాయి. 16వ రౌండ్ లో దామచర్లకు 6455 ఓటు రాగా, బాలినేనికి 5056 ఓట్లు వచ్చాయి. 17వ రౌండ్ లో దామచర్లకు 5126 ఓట్లు రాగా, బాలినేనికి 4409 ఓట్లు వచ్చాయి. 18వ రౌండ్ లో దామచర్లకు 5316 ఓట్లు రాగా, బాలినేనికి 3717 ఓట్లు వచ్చాయి. అలాగే 19వ రౌండ్లో దామచర్లకు 2612 ఓట్లు రాగా, బాలినేనికి 5672 ఓట్లు వచ్చాయి. మొత్తం మీద దామచర్లకు లక్ష 18,800 ఓట్లు రాగా, బాలినేనికి 84,774 ఓట్లు వచ్చాయి.సమీపంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తురకపల్లి నాగలక్ష్మి 2067 ఓట్లతో నిలిచారు. కాగా నోటాకు 1310 ఓట్లు వచ్చాయి.

మంత్రుల నోటి దూల వల్లే వైసీపీ భూస్థాపితం

- నన్ను ఇబ్బందులు పెట్టిన ప్రతి ఒక్కరికి శిక్షపడేలా లోకేష్ చర్యలు తీసుకోవాలి
- ‘దామచర్ల’కు మంత్రి పదవి కేటాయించాలి
- మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు సుబ్బారావు గుప్తా

విశాలాంధ్ర -ఒంగోలు : ఆ ఐదుగురు వైసీపీ మంత్రుల నోటి దూల వల్లే రాష్ట్రంలో వైసీపీ భూస్థాపితం అయ్యిందని టిడిపి నాయకులు సుబ్బారావు గుప్తా అన్నారు. ఒంగోలులోని హోటల్ కొల్లాస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుబ్బారావు గుప్తా మాట్లాడుతూ తాను వైసీపీలో ఉన్న సమయంలో మంత్రులు మంచి భాషలో మాట్లాడాలని, లేని పక్షంలో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించానన్నారు. అయితే పార్టీ అధిష్టానం తన మాటలో లెక్క చేయలేదని, తిరిగి తలపైనే దాడి చేసి చిత్రహింసలకు గురి చేశారని, తన కుటుంబ సభ్యులను వేధించారని, గంజాయి కేసులలో ఇరికించారని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని, రెండుసార్లు జైలుకు పంపారని తెలిపారు. అయితే కానీ చెప్పినట్లే ప్రస్తుతం పార్టీ పరిస్థితి రాష్ట్రంలో భూస్థాపితం అయిందన్నారు. లోకేష్ రెడ్ డైరీలో తనను బాధించిన వారికి ఒక పేజీ కేటాయించారని పేర్కొన్నారు. తనను ఇబ్బంది పెట్టిన వారిని చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తాను చెప్పినట్లే, బాలినేని కుటుంబం ఒంగోలు వదిలిపెట్టి హైదరాబాద్ పారిపోయారు అన్నారు. జిల్లాలో దామచర్ల కుటుంబానికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఒంగోలులో కబ్జాలకు గురైన భూములను తిరిగి పించేందుకు దామచర్ల చర్యలు తీసుకోవాలని కోరారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుండి అభివృద్ధి పథంలో ప్రజా రంజికమైన పాలన ఇవ్వాలని కోరారు.

‘ఉగ్ర’కు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-పీసీపల్లి : కనిగిరి కూటమి ఎమ్మెల్యేగా గెలుపొందిన ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి మండల నాయకులు అభినందనలు తెలిపారు. బుధవారం కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌కు పీసీ పల్లి మండలం ముఖ్య నాయకులు అభిమానులు కార్యకర్తలు భారీగా చేరుకుని ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసమే నిరంతరం పనిచేస్తుందని ఆశాభావవ్యక్తం చేశారు.

నీట్‌లో ‘జీఎన్ఆర్’ హవా

విశాలాంధ్ర -ఒంగోలు : నీట్ 2024 పరీక్ష ఫలితాలలో ఒంగోలులోని రెవెన్యూ కాలనీలోని జీఎన్ఆర్ మెడికల్ అకాడమీ విద్యార్థులు తమ సత్తా చాటారు. 720 మార్కులకు గాను వి హనిష్క 637 మార్కులు, పి.విశ్వక్సేన్ 628, ఎన్ సుహాసిని 606, పి.ప్రసాద్ 605, బి లక్ష్మీ నరసింహ 595, జి షాలెం రాజు 591, ఎస్ డి మహియా 586, ఎం లాస్య 584, కే లోకేష్ వర్మ 581, బి రవి కుమార్ 580, కె యశస్వి 577, ఎస్కే ఫర్హానా 575 మార్కులు సాధించారు. దీనితో పాటుగా 564,563, 559, 556,554, 553,547, 538,534, 533, 531,526, 521,515, 514,512, 511, 509, 502,500 మార్కులతో వివిధ క్యాటగిరిలలో 38 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించే అవకాశం ఉన్నట్టు అకాడమీ డైరెక్టర్ గోగినేని నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గోగినేని నాగేశ్వరరావుతో పాటుగా, ఉన్నం ఉదయ కిషోర్ బాబు,ఆర్ సురేష్,ఎన్ హరిబాబు, వి.శ్రీనివాసులు రెడ్డి, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.

విశాలాంధ్ర

గుర్రపు డెక్కను తొలగించరూ....?

■ వ్యర్థాలతో నిండిపోయిన డ్రైనేజీ

■ పట్టించుకోని అధికారులు రైతులు ఆందోళన

విశాలాంధ్ర - రేపల్లె : తీర ప్రాంతంలో ఎక్కడ పూడికలు తీయ టంగాని, గుర్రపు డెక్క తొలగించ దంగాని, సంబంధిత అధికారులు పూర్తి చేసిన దాఖలాలు లేవు.ప్రతి ఏడాది రైతులను ఈ సమస్య వెంటా డుతూనే ఉంది. వర్షాలతో పంట పొలాల్లో తిష్ట వేసిన మురుగు నీరు బయటకు పోవాలంటే మురుగు కాల్వల్లో నీరు పోయేలా ఉండాలి.ఈ విధంగా గుర్రపు డెక్కతూటి కాడ కూరుకుపోయి ఉంటే పంట పొలాల్లో నిలిచిన నీరు నిల్వ ఉండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైన్లలో పెరిగిపోయిన గుర్రపు డెక్కవ్యర్థ పదార్థాలు,ముళ్ళ కంపలు, తొలగించాలని ఎన్నిసార్లు డ్రైనేజీ అధి కారులకు విన్నవించి నా పట్టించు కోవడం లేదంటూ రైతులు ఆరోపిస్తు న్నారు.తీర ప్రాంతంలోని నియోజక వర్గంలోని రేపల్లె, నగరం, నిజాంప ట్నం,చెరుకుపల్లి,మండలాల్లో సుమా రు ఒక లక్ష 200 ఎకరాలకుపైనే వరి సాగు చేస్తున్నారు.అధిక వర్షాల కారణంగా పంటపొలాల్లోని వర్ష నీరు బయటకు వెళ్లక ప్రతి సంవత్సరం వేసిన వరి నాట్లు ముంపుకు గురై లక్షలాది రూపాయలు నష్టపోతున్నా మని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.దీనికి ప్రధాన కారణం మురుగునీరు పారుదల లేకపోవడమే కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైన్లలో పేరుకుపో యిన గుర్రపు డెక్క, వ్యర్థ పదార్థాలు, తూటి కాడ తొలగించి మరమ్మత్తులు నిర్వహించాలంటూ తీర ప్రాంత రైతులు డ్రైనేజీ శాఖ ఉన్నతాధి కారులను కోరుతున్నారు.

ఎన్టీఆర్, వంగవీటి విగ్రహాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర-పర్చూరు: ప్రజా కూటమి విజయం సాధించటంతో టీడీపీ, జనసేన నాయకులు బుధవారం స్థానిక బొమ్మల సెంటం లోని ఎన్టీఆర్, వంగవీటి మోహనరంగా విగ్రహా లకు పాలాభిషేకం చేశారు. వారి సేవలను కొనియాడారు. ప్రజా కూటమికి జిందాబాద్ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- ఎన్‌సీసీ అధికారి పిడపర్తి పేరిరెడ్డి

విశాలాంధ్ర-పర్చూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎన్‌సీసీ అధికారి పిడపర్తి పేరిరెడ్డి తెలిపారు. ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో, పాఠశాల ల్లో, ప్రభుత్వ భూములలో మొక్కలు నాటి పోషించాలని తెలిపారు. కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయులు భవనం శివలీల, బందారు అనిల్‌కుమార్, అంబటి సురేష్, ఆదినారాయణ, బ్రహ్మయ్య, సంధ్యారాణి, కంబాలపాటి నర్సయ్య ఉన్నారు.

డ్రాయింగ్‌పై విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర - అద్దంకి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం డ్రాయింగ్ మాస్టర్ కత్తి బాల కోటేశ్వరరావు విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు.స్టోరీ టెల్లింగ్ డ్రాయింగ్ నేర్పించారు.ఈ శిబిరంలో 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు.గ్రంథాలయ లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారంతో ముగు స్తున్నాయని గురువారం సాయంత్రం గ్రంధాలయ ఆవరణంలో ముగింపు సభ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు గ్రంథ పాలకుడు చుండూరి సుగుణరావు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - చీరాల : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని,పర్యావరణహిత జీవ నంతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని సమగ్ర శిక్ష జిల్లా వారి ఆధ్వర్యంలో చీరాల ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లా డుతూ ప్రజలందరు పర్యావరణహిత జీవన శైలిని అలవర్చుకునేలా గ్రామస్థాయి నుండి విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వ హించాలన్నారు. పర్యావరణహితానికి సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని వాటి స్థానంలో గుడ్డసంచులు వినియో గించాలన్నారు. నీటిని సంరక్షించే వ్యవసాయ పద్ధతులు పాటించాలని,వర్షపు నీరు ఆదా చేయడం,నీటిని వృధా చేయకూడదని,విద్యుత్ పొదుపుకు సిఎల్ఎఫ్,ఎల్ ఈడి బల్బులు విని యోగించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, తడిపొడి చెత్త వేరు చేసి ఇవ్వడం,పరిసరాల పరిశుభ్రత,స్వచ్ఛవాయువుల కోసం ఎక్కువ చెట్లు నాటడంతో పర్యావరణాన్ని పరిర క్షించగలుగుతామన్నారు.జూన్ 12వ తేదీ నుండి 19వ తేదీ వరకు పాఠశాలల్లో ఎకో క్లబ్బుల ద్వారా పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని ప్రధానో పాధ్యాయులను తెలిపారు.అనంతరం ప్లాస్టిక్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు సరళ, సమగ్ర శిక్ష అధికారులు శ్రీనివాస రెడ్డి,చారులత, డీసీఈబి సెక్రటరీ డి.ప్రసాదరావు,నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కోఆర్డినేటర్ పవని భాను చంద్రమూర్తి,చీరాల ఎంఈవో -1 పి.సుబ్ర హ్మణ్యేశ్వరరావు, సుజాత, పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ

- పర్యావరణ పరిరక్షణోద్యమ సారథి జంపాల గంగాధరరావు

విశాలాంధ్ర - చీరాల : ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ ప్రజల సహకారంతోనే సాధ్యమని రిటైర్డ్ ప్రిన్సిపాల్ పర్యావరణ పరిరక్షణోద్యమ సారథి జంపాల గంగాధరరావు అన్నారు.బుధవారం సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భూ కాలుష్యాన్ని తగ్గించకపోతే భవిష్యత్తు ప్రమదకరంగా ఉంటుందని అన్నారు.ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కాలుష్య నివా రణలో ప్రజలకు అవగాహన కలిగుండలన్నారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు.అనంతరం సీనియర్ సిటిజన్స్ సభ్యులు గంగాధరరావును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.అనంతరం కొనికి ప్రసన్న లక్ష్మి బ్రెయిన్ యాక్టివేషన్ కోర్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు వినయ్,ప్రకాష్,ప్రదర్శన అందర్నీ ఆకట్టు కుంది.ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు,సీనియర్ సిటిజన్స్ నాయకులు గాదెహరిహరరావు,సింహాద్రియలమందారెడ్డి,ఏ.రామారావు,జయరామిరెడ్డి,కో దూరి ఏకాంబరేశ్వరరావు,లోహియా,ఊర మస్తానారావు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ధన్యవాదాలు: ఎమ్మెల్యే అనగాని



విశాలాంధ్ర - రేపల్లె : సార్వత్రిక ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన రేపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రేపల్లె నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ,జనసేన,బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, ధన్యవాదాలు తెలిపారు.నియోజకవర్గ ప్రజలకు అందు బాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే సత్యప్రసాద్ ప్రజలకు హామీ ఇచ్చారు.ఎల్లప్పుడు ప్రజాసేవలో అంకితమై పనిచేస్తానని ఈ సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్యే వాగ్దానం చేశారు.మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనగాని కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

నిలిచిపోయిన మహిళ వసతి భవన నిర్మాణ పనులు

- బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులు నిలిపివేత

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 2016 సంవత్స రంలో శంకుస్థాపన జరిగి ఒక సంవత్సరం పాటు భవన నిర్మాణ పనులు చక చకా సాగా యి. సుమారు 60 లక్షల రూపాయలు ఆర్. అండ్.బి శాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకు లకు,డిగ్రీ విద్యార్థుల కోసం నిర్మిస్తున్న మహిళా వసతి భవనం ఆదిలోనే హంసపా దుగా గత ఐదు సంవత్స రాలుగా ఎలాంటి నిర్మాణ పనులు చేపట్ట కుండానే అసంపూ ర్తిగా భవనం మిగిలిపో యింది.యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ మంజూరు చేసిన 60 లక్షల రూపాయలు నిధులతో 2016 సంవత్సరంలో శంకుస్థాపన జరిగి కొంత కాలం పాటు నిర్మాణ పనులు ప్రారంభ అయిన తర్వాత కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు రావడంలో జాప్యంతో అప్పటి నుండి నిర్మాణ పనులను మధ్యలోనే ఆపివేసి కాంట్రాక్టర్ సర్దుకున్నాడు.అప్పటి నుండి ఈ భవన నిర్మాణం అలాగే ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండా అసంపూర్తిగానే ఉంది. సరైన వసతులు లేక మహిళా అధ్యాప కులు,డిగ్రీ చదువుతున్న మహిళా విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.భోజన విరామ సమయంలో సరైన వసతులు లేక వారు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ విద్యా సంవత్సరంలో అయినా భవన నిర్మాణ పనులు ప్రారంభించి మహిళా వసతి భవనం అభివృద్ధి పరచాలని వారు విద్యాశాఖ అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

'పది' పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - బల్లికురవ : కొప్పెరపాడు జిల్లా పరిషత్ హైస్కూలోని విద్యార్థిని విద్యార్థులు ఇటీవల జరిగిన ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్‌షిప్ ఫలితాల్లో పదిమంది విద్యార్థులు అత్యు త్తమ ఫలితాలు సాధించడంపై పలువురు అభినందించారు.పాఠశాలకు చెందిన నలజర్ల కీర్తన జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించగా గుంట కల కోటేశ్వరరావు జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించాడు.వారిని పాఠశాల ఇంచార్జి ప్రధానో పాధ్యాయులు జిల్లా నాగేశ్వరరావు ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాల కమిటీ చైర్మన్ దమ్ము అంజయ్య గ్రామ పెద్దలు అభినందించారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చదువుకోవాలనే దృఢ సంకల్పంతో ప్రతి ఒక్కరు అత్యుత్తమ విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు.

వేగేశనకు ఖాజా అభినందనలు

విశాలాంధ్ర - కర్లపాలెం : బాపట్ల ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగేశన నరేంద్రవర్మకు కర్లపాలెం ముస్లిం మైనా ర్టీ నాయకుడు ఖాజా బుధవారం ఆయన గృ హంలో మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం స్వీటు పెట్టి అభినంద నలు తెలిపారు.

ఎమ్మెల్యే 'గొట్టిపాటి'కి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - అద్దంకి : వరుసగా ఐదో సారి మంచి మెజారిటీతో గెలిపించుకున్న గొట్టిపాటి రవికుమార్‌ను కలిసేందుకు అద్దంకి నియోజకవర్గ ప్రజలు,టీడీపీ,జనసేన బీజేపీ నాయకులు,కార్యకర్తలు బుధవారం భారీ సంఖ్యలో చిలకలూరిపేటలోని నివాసానికి చేరుకుని తమ అభిమాన నేత గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కష్టపడి పని చేసినందుకు అభినందించారు.

హరిత జీవనశైలిని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజలందరూ పర్యావరణహితమైన జీవనశైలి అలవర్చుకుంటేనే భూగోళం మీద మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు అన్నారు.భూతాపం వల్ల రుతువులు గతితప్పడం,జీవవైవిధ్యం దెబ్బ తినడం జరుగుతుందన్నారు.ఫలితంగా వ్యాధులు పెచ్చరిల్లుతాయన్నారు.దీనిని అరికట్టడానికి అందరం కర్బన ఉద్గారాల విడుదలను నియంత్రించడం,చెట్లను పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టవలసి ఉందన్నారు.ఇంధనాన్ని,నీటిని పొదుపుగా వాడుకోవాలి,సొంత వాహనాల వినియోగం తగ్గించి,ప్రజా రవాణాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి,సహజ వనరులను కొల్లగట్టడాన్ని నివారించాలి,ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో గోడప్రతులను విడుదల చేశారు.పర్యావరణాన్ని పరిరక్షిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గిస్తామని చెప్పారు.ఎస్ఎంజి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంజి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వేదవతి,అధ్యాపకులు జాన్ సైద, ఉదయభాస్కర్, లావణ్య, సునీత,రమ్య లత,సుమతి,బేబీరాణి,లక్ష్మి తులసి, అన్వర్ పాల్గొన్నారు.

సుబ్బారావు కన్నుమూత

విశాలాంధ్ర - వేటపాలెం : కవిరాజు బిరుదాంకితులు కడెం వెంకటసుబ్బారావు(100) వయోభారంతో మంగళవారం రాత్రి కన్ను మూశారు. బండ్ల బాపయ్య విద్యాసంస్థలలో తెలుగు అధ్యాపకునిగా,కవిరాజుగా పరిసర ప్రాంత ప్రజలకు సుపరిచితులు.కడెం వెంకటసుబ్బారావు భౌతిక కాయాన్ని ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.ఆయన మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందినవారు.జీవనజ్యోతి, ఖడ్గ తిక్కన కావ్యం,నాటకం బండ్ల బాపయ్య శెట్టి జీవిత చరిత్ర,పుణ్యపురుషుడు వేమన పద్య శతకం రచనలను పూర్వపు సుప్రీంకోర్టు జస్టిస్ జస్ట్ చలమేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు.వివేకావ దేవాంగ పురాణం మను కావ్య ఆత్మ శిఖరాగ్రము రెండు భాగాలు రచించి పరిపూర్ణ రాజయోగం బాశిష సాత్వికం రచనలు చేసి కవిరాజు బిరుదులను పొందారు.పలువురు ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.అడ్వకేట్ జోగుపర్తి ప్రసాద్ తాడిపోయిన కేశవరావు సత్రం మల్లేశ్వరరావు విశ్వేశ్వరరావు అచల పరిపూర్ణ మండలి సమాజం, రిటైర్డ్ ఎంపీడీవో పొగడదండ వెంకట సుబ్బారావు తదితర ప్రముఖులు ఉన్నారు.

'గొట్టిపాటి'కి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - బల్లికురవ : అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ వరుసగా 5సారి విజయం సాధించడంతో బుధవారం బల్లికురవ మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి తెలుగుదేశం,జనసేన,బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లి చిలకలూరిపేటలోని గొట్టిపాటి నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు.అద్దంకి నియోజవర్గం నుండి గొట్టిపాటి 25070 వేల మెజార్టీతో విజయం సాధించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు

విశాలాంధ్ర - కర్లపాలెం : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని కర్లపాలెం ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసు రావు అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కర్లపాలెం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ఆఫీస్ దగ్గర పర్యావరణ పరిరక్షణపై కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా పోలీసు రావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కొరకు అందరు కృషి చేయాలన్నారు.అందులో భాగంగా ప్లాస్టిక్ నిషేధించాలని,మొక్కలను పెంచాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా గంపాల వెంకటరెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుందాం ప్రకృతిని సంరక్షించుకుందాం భావితరానికి ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందిద్దాం అన్నారు.ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గంపాల వెంకటరెడ్డి,ఆట్ల వెంకటేశ్వర్ రెడ్డి,నమ్మెట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కళ్యాణోత్సవాలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక నల్ల గాంధీ బొమ్మ కూడలి వద్ద ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ మల్లేశ్వర స్వామి వారికి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి భక్తి శ్రద్ధలతో కళ్యాణోత్సవాలు నిర్వహించారు. దేవ స్థానం ఎదురుగా ఉన్న ప్రదేశంలో దేవీ దేవ తలను వేంచేపు చేశారు.సుమంగళ వాయిద్యా ల మధ్య వేదోక్త మంత్రాలతో శాస్త్ర యుక్తంగా కళ్యాణోత్సవాలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆలయ అర్చకులు దివాకర శర్మ మా ట్లాడుతూ మాస శివరాత్రి పర్వదినం, కృత్తికా నక్షత్రం ఒకే రోజు రావడం అరుదుగా జరుగుతుందని తండ్రి శంకరుడు, తనయుడు కుమార స్వామి కళ్యాణోత్సవాలు ఒకే సారి చేయడం సంతోషకరమైన విషయం అన్నారు. కళ్యాణ అక్షతలను, తీర్థ, ప్రసాదాలను అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు,మహిళలు,ఆలయ కమి టీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేగేశనకు అభినంధనల వెల్లువ

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల అసెంబ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగేశన నరేంద్ర వర్మకు ప్రజాభిమానంతో అభినంధనలు వెల్లువెత్తాయి. పార్టీ కార్యాలయంలో బుధ వారం ప్రజలు అధిక సంఖ్యలో వేగేశనకు పూలమాలలు, దృశాలువాలతో ఘనంగా సత్కరించి స్వీట్లు పెట్టారు. రెండు దశాబ్దాల తరువాత టీడీపీ జెండా బాపట్లలో ఎగర వేయటంతో కేడర్ ఫుల్‌జోష్‌లో ఉన్నారు. సేవకుడిగా ప్రజల మనుస్సులో సుస్థిర స్థానం సంపాదించుకున్న నరేంద్రవర్మకు ప్రజలు 27768 ఓట్ల మెజార్టీతో గెలుపొంది గతంలో ఎన్నడు లేని విధంగా మెజార్టీ సాధించా రన్నారు. వేగేశనకు అన్నీ వర్గాల నుంచి ప్రజా మద్దతు ఉండటం అతని మొజార్టీకి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. వేగేశనకు అభినంద నలతో పార్టీ కార్యాలయం కిక్కిరిసిపోయింది.

రాక్షస పాలన నుంచి విముక్తి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర ప్రజలకు రాక్షస పాలన నుంచి విముక్తి కలిగించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల పాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రజలు ఓటుతో స్పష్టమైన తీర్పు ఇచ్చి చంద్రబాబు నాయకత్వంలో ప్రజా రంజక పాలన కోరు కోవటం శుభపరిణామం అన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవటం హర్షనీయం అన్నారు. ప్రజలు ఇంత గొప్ప విజయాలను ఇచ్చినందుకు రాజశేఖర్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కనీవిని ఎరుగని రీతిలో అద్భుతమైన విజయాన్ని సాధించిందన్నారు. ఇప్పటివరకు అధికారాన్ని చేపట్టిన వైయ స్సార్సీపి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా కోల్పోయిందన్నారు. జనసేన పార్టీ అధినేత అయిన పవన్ కళ్యాణ్‌కి జిల్లా తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రతి పక్షాల ఓటు చీలకుండా ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. పార్లమెంట్ నియోజ కవర్గ పరిశీలకులు మాజీ శాసనసభ్యులు బాచిన చెంచు గరటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు చీరాల గోవర్ధనరెడ్డి, కళ్లం హరినాధరెడ్డి, పమిడి భాస్కరరావు, తాతా జయప్రకాష్ నారాయణ తదితరులున్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా

పాలన సాగించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో గెలుపొందిన ఎమ్మెల్యేలు ప్రజాస్వామ్య బద్ధంగా పాలన సాగించి జిల్లా పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ కోరారు.సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలకు సింగరకొండ శుభాకాంక్షలు తెలిపారు. వేమూరి ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు,రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్,బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ,చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు,అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌లకు శుభాకాంక్షలు తెలుపుతున్నామని రాబోవు రోజుల్లో ప్రజాభీష్టం మేరకు నీతివంతమైన పాలన అందించాలని కోరారు.

'ఉగ్ర'కు ప్రత్యేక అభినందనలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి తరుపున టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి నియోజకవర్గంలోని కాపులంతా అండగా నిలిచి ఓట్లు వేసి ఆయన గెలుపులో కీలక పాత్ర పోషించినందుకు కనిగిరి నియోజకవర్గ కాపునాడు అధ్యక్షులు డాక్టర్ ఆర్ రామయ్య నాయుడు కాపులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కనిగిరి శ్రీదేవి నర్సింగ్ హోమ్ నందు బుధవారం పట్టణంలోని కాపు సంఘ నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమా వేశమయ్యారు. ఈ సందర్భంగా రామయ్య నాయుడు మాట్లాడుతూ ఉగ్ర నరసింహారెడ్డి కులమతాలకు అతీతంగా అందరినీ కలుపుకొని పోయే వ్యక్తిత్వం ఉన్న మనిషి అని, ఆయన నాయకత్వంలో వెనుకబడ్డ కనిగిరి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఉద్దేశంతోనే కాపులంతా భేషరతుగా కనిగిరిలో ఉగ్ర నరసింహారెడ్డి గెలుపుకు సహకరించారన్నరు అన్నారు. సమావేశంలో కనిగిరి పట్టణ కాపు సంఘ నాయకులు ముండ్లమూరి మాలకొండయ్య, నారపు శెట్టి నరసయ్య, ఎల్ వీ ఆర్, సున్నా శ్రీను, కొప్పనాదం వెంకటాద్రి, కదిరి ప్రసాద్, రావెళ్ల కోటేశ్వరరావు, వేలం వెంకటయ్య, చిరివెళ్ల ప్రసాద్, బేధం శెట్టి యోగేశ్వరరావు, ముండ్లమూరి మాధవరావు, శెట్టిపల్లి కొండలరావు, జలపాటి తిరుపతి ,కొండలు, కొట్టే ప్రసాద్ పాల్గొన్నారు.

సంతనూతలపాడులో

రెండు దశాబ్దాల తర్వాత పసుపు జెండా రెపరెపలు

విశాలాంధ్ర-చీమకుర్తి : సంతనూతలపాడు నియోజకవర్గంలో రెండు దశాబ్దాల తర్వాత తిరిగి మరల పసుపు జెండా రెపరెపలాడింది. టిడిపి,జనసేన, బిజెపి, ఉమ్మడి పార్టీ అభ్యర్థిగా టిడిపి తరపున ఉమ్మడి అభ్యర్థి బి.ఎన్. విజయకుమార్ సంతనూతలపాడు నియోజకవర్గంలో బరిలో నిలబడ్డారు. తను సమీప ప్రత్యర్థి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ మంత్రి మేరుగ నాగార్జున పై 30,385 కోట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ గెలుపుతో సంతనూతలపాడు నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించిన అభ్యర్థిగా విజయ్ కుమార్ నిలిచారు. 1983లో ఆరేటి కోటయ్య వీ. ఎల్లయ్య పై 33,000 పైచిలుకు మెజారిటీతో టిడిపి అభ్యర్థిగా గెలుపొందారు. అప్పటినుండి ఇప్పటివరకు సంతనూతలపాడు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా గెలుపొందిన వారే లేరు. ఈ ఘన విజయానికి కారణం టిడిపి జనసేన బిజెపి పొత్తేనని, అంతేకాకుండా నియోజకవర్గంలో గత మూడు పర్యాయాల నుంచి టిడిపిని అంటిపెట్టుకొని లోకల్ గా ఉన్న సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, ప్రజలకు అందు బాటులో ఉండటమే నని అంటున్నారు. అప్పుడు సీపీ ఎం అభ్యర్థి తవనం చెంచయ్య టిడిపిలో పొత్తు భాగంగా 1994లో గెలుపొందారు. ఆ తర్వాత టీడీపీ అభ్యర్థి డేవిడ్ రాజు 1999లో టిడిపి నుండి గెలుపొందారు. అప్పుడు ఆయనకి వచ్చిన మెజారిటీ 9078, ఇప్పటివరకు టిడిపి అభ్యర్థి సంతనూతలపాడు నియోజకవర్గంలో గెలుపొందలేదు. నాటి నుంచి ఇప్పటివరకు టిడిపి అభ్యర్థికి సంతనూతలపాడు నియోజకవర్గం అందని ద్రాక్ష లాగానే మిగిలింది. తర్వాత 2004లో ధారా సాంబయ్య కాంగ్రెస్ పార్టీ తరపున,2009లో బిఎన్ విజయకుమార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. అప్పుడు బి.యన్. కుమార్ కు వచ్చిన మెజారిటీ 9537, ఆ తర్వాత బి.యన్. విజయ్ కుమార్ టిడిపిలో చేరి అప్పటినుంచి ఇప్పటివరకు కూడా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుంటూ ప్రజల సమస్యలు తనలో భాగంగా చేసుకుంటూ నియోజకవర్గంలోనే నాయకులతో తిరుగుతూ ప్రజల్లో మమేకమయ్యారు. 2014లో ఆదిమూలపు సురేష్ వైసీపీ పార్టీ తరపున గెలుపొందారు. 2019లో వైసిపి అభ్యర్థి టీజేఆర్ సుధాకర్ బాబు 9531 ఓట్లతో టిడిపి అభ్యర్థి బి.ఎన్.విజయ్ కుమార్ పై గెలుపొందారు.

తర్వాత ఇద్దరూ వైసీపీ అభ్యర్థులు కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి అభ్యర్థిగా 30, 385 ఓట్లతో గెలుపొందిన బి.ఎన్.విజయ్ కుమార్ రికార్డు సాధించారు. 1983లో ఆరేటి కోటయ్య తరువాత అత్యధిక మెజార్టీ సాధించిన నియోజకవర్గ అభ్యర్థిగా బిఎన్ విజయ్ కుమార్ నిలిచారన్నారు.

పర్యావరణ దినోత్సవ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలోని పలు పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ అవగాహన ర్యాలీలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మండలంలోని లింగారెడ్డి కాలనీ లోని మండల ప్రాథమిక పాఠశాలలో, మండల కేంద్రమైన తర్లుపాడులోని హిందూ ఎలిమెంటరీ పాఠశాలలో ప్లే కార్డులతో ప్రపంచ పర్యావరణ దినోత్సవ అవగాహన ర్యాలీ లను పురవీధులలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె మౌలాలి, అల్లారయ్యలు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నిషేధించడం, విద్యుత్తును ఆదా చేయడం, కాలుష్యాన్ని నివారించడం, పచ్చని చెట్లను పెంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, అనే సామెతకు ప్రతి ఒక్కరూ దోహదపడాలన్నారు. ప్లాస్టిక్ బాటిల్, ప్లాస్టిక్ సంచులు వాడకాలను పూర్తిగా తగ్గించాలని విద్యార్థులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథ పాలకుడు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంధాలయంలో బుధవారం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, కథలు చెప్పడం, చదివించడం, వకృత్వ పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి ప్రజలకు అండగా ఉంటా

- గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని అధైర్యం పడవద్దని టిడిపి జనసేన బిజెపి కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. నాయకుల్లారా , కార్యకర్తలారా నా కుటుంబ సభ్యులారా. నన్ను మీ బిడ్డగా 40 రోజుల తక్కువ సమయంలో మీ ఆడబిడ్డగా ఆదరించి ఓట్లేసి నా గెలుపు కోసం శ్రమించిన ప్రతి ఒక్కరి కృషిని నేను మర్చిపోను. మీ బిడ్డగా ఆదరించి నియోజకవర్గంలోని దాదాపు 48శాతం మంది ప్రజలు నాకు ఓటేసి నా విజయం కోసం వెన్నుదన్నుగా నిలబడ్డారు. అయితే వైసిపి చేసిన రాజకీయ కుతంత్రాలలో స్వల్ప ఓట్లతో మనం సాంకేతికంగా ఓడిపోయాము. అయినా ప్రజల్లో గెలిచాం. తెలుగుదేశం అధినేత మన ప్రియతమ నేత నారా చంద్రబాబునాయుడు దర్శి నుండి పోటీ చేసేందుకు నాకు అవకాశం కల్పించారు. మీరందరు కూడా నన్ను మీ బిడ్డగా ఆదరించారు. ప్రతి ఒక్కరికి మరొక్కసారి కృతజ్ఞతలు చెబుతున్నాను. అదేవిధంగా రాష్ట్రంలో తిరుగులేని అధికారాన్ని సాధించిన కూటమి ప్రభుత్వాన్ని స్వాగతిద్దాం. ప్రజల ఆకాంక్షల నెరవేర్చేందుకు ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు తీపించేందుకు మన చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం శుభ పరిణామం. తిరుగులేని విజయాన్ని సాధించిన మన నాయకుడు చంద్రబాబు నాయుడు కాబోయే మంత్రి వర్గానికి, గెలిచిన శాసనసభ్యులందరికీ అదేవిధంగా ఈ విజయంలో ముందుండి నడిపించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ప్రధాని మోడీకి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. దర్శి అభివృద్ధికి నేను ఇచ్చిన మాట ప్రకారం మన ప్రభుత్వం ద్వారా పాటుపడతానని మరొకసారి అందరికీ తెలియజేస్తూ నేను మీ బిడ్డగా దర్శి ప్రజల రుణం తీర్చుకుంటానని మీ అందరి ఆశీస్సులతో మీతో పాటు దర్శిలో ఉండి దర్శి అభివృద్ధికి పాటుపడతానని తెలియజేస్తున్నానని అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

-టీడీపీ యువనేత మాగుంట రాఘవరెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రజా సేవపరమావధిగా మొదలైన మాగుంట కుటుంబ రాజకీయ పర్వం, తరాలు మారిన ప్రకాశం జిల్లా ప్రజల సేవకే అంకితమై, ఎల్లప్పుడూ మీకు తోడుగా ఉంటుందని టిడిపి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో టి.డి.పి. బీ.జె.పి. - జనసేన పార్టీల కూటమి గెలుపుకోసం ఒంగోలు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో మాగుంట శ్రీనివాసులరెడ్డి ,తన ప్రచార కార్యక్రమాలలో మండుటెండలను, మాగుంట శ్రీనివాసులరెడ్డి మరియు ఆయన సహచర అసెంబ్లీ అభ్యర్ధులకు అఖండ విజయాన్ని అందించినందుకు ఒంగోలు పార్లమెంటు ఓటరు మహాశయులకు, తెలుగుదేశం, జనసేన మరియు బీజేపీ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు, ఉద్యోగులకు మరియు ప్రజలకు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. మాగుంట ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగింపుతోపాటు ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరి రక్షించాలని ఎంఈఓలు కె. కాశయ్య, సీవీ రమణారెడ్డి లు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను నిషేదించాలని, వృక్షాలను రక్షించి గాలి కాలుష్యాన్ని తగ్గించాలని, అందరూ ఒక్కో మొక్కను నాటాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్ పీ మహబూబీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

విశాలాంధ్ర-గిద్దలూరు : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గిద్దలూరు మండల న్యాయ సేవాధికారసంస్థ వారి ఆధ్వర్యంలో కోర్ట్ ప్రాంగణము నందు జరిగిన కార్యక్రమంలో మొదటగా డిప్యూటి డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పి.శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.జి.వి. శ్రీనివాసులు, సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ తోట శ్రీనివాసులు , గిద్దలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ఎన్. శేషశయనారెడ్డి ప్రధాన కార్యదర్శి ఉదయగిరి మల్లికార్జునరావు, సీనియర్ న్యాయవాదులు యస్.వి.నాగేంద్ర బాబు,కె.రవి ప్రకాష్ బాబు,కె.సత్య సులోచన, ఎం.రంగా రెడ్డి,బి.గిరి,బి. ప్రకాష్,ఈ. సత్యనారాయణ, ఎం.పిచ్చయ్య, బి.సంధ్యా రాణి,ఎన్. అహల్య, డి.సిద్దయ్య, యస్.కె. ఫాజిల్,బి.రాజ్ కుమార్ నాయక్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం నందు గిద్దలూరు న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కండి

- గుండ్లకమ్మ రేంజి అధికారి హెచ్. జీవన్ కుమార్

విశాలాంధ్ర-గిద్దలూరు : గుండ్లకమ్మ రేంజి పరిధిలోని దిగ్గువమెట్ట వన విహారి నందు పర్యావరణ దినోత్సవం సందర్భంగా వన విహారి ఆవరణలో దిగువ మెట్ట గ్రామస్తులు, మహిళల చేత మొక్కలు నాటించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుండ్లకమ్మ రేంజి అధికారి హెచ్. జీవన్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం దిగువమెట్ట డిప్యూటీ రేంజి అధికారి డీ. వంశీకృష్ణ, సెక్షన్ అధికారి ఎస్.కె జమాల్ వలి,అటవీశాఖ బిట్ అధికారులు, సెక్షన్ సిబ్బంది, స్వచ్ఛ సేవకులు, చెక్ పోస్టు హెల్పర్లు పాల్గొన్నారు.

భైరవకోనలో 'ఉగ్ర' ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి బుధవారం జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పర్యాటక కేంద్రమైన భైరవకోనను సందర్శించి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి స్థానిక మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా జలపాతంను వీక్షించి త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని, కాళభైరవేశ్వరస్వామిని, సంగమేశ్వరస్వామి ఇతర శివలింగాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవస్థానం అర్చకులు వేద మంత్రాలతో శేష వస్త్రంతో ఉగ్రనరసింహారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్య, టీడీపీ నాయకులు వెంకటరామరాజు, నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, రవి, రమేష్, సురేష్, వెంకటరెడ్డి, చిన్న, వాసు, బత్తుల రమణయ్య, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, శ్యాంకుమార్, నారాయణరావు, మన్నేపల్లి శ్రీనివాసులు, మన్నేపల్లి కార్తీక్, మన్నేపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే అనగాని

విశాలాంధ్ర - రేపల్లె : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని ఉండవల్లిలో కలిసి మంగళగిరి శాసనసభ్యులుగా విజయం సాధించి నందుకు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయ నకు రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాలనలో అమరావతి ఆశ్విత రాజధానిగా రూపొందించడానికి నారా లోకేష్ కృషి చేస్తారని ఎమ్మెల్యే అనగాని ఆశాభావం వ్యక్తం చేశారు.

'ఏలూరి'కి అభినందనలు వెల్లువ

విశాలాంధ్ర - యద్దనపూడి : పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించటంతో యద్దనపూడి మండలంలోని అన్ని గ్రామాల నుంచి అభిమానులు నాయకులు కార్యకర్తలు భారీగా ఏలూరి క్యాంప్ కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్చాలు ఎమ్మెల్యేకు అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి 24,138 వేల మెజార్టీ సాధించ టంతో పలువురు నాయకులు ఆనంద వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల టీడీపీ అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారక రామారావు, రాయపాటి సీతయ్య, వజ్జా సుబ్బరామయ్య, దొడ్డ అప్పారావు, కొరిటాల వంశీకృష్ణ, కోయ సతీష్, కర్లపూడి నారాయణస్వామి, సింగ్ చంద్రశేఖర్, ఈరపనేని వాసు, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, కొండల రాయుడు, సతీష్, ఈదల అనిల్, నిమ్మల సాంబశివరావు, పెరవల్లి వెంకట్రావు, వంకాయల పాటి సుబ్బారావు సోమే పల్లి బాబు, పత్తిపాటి వేణునాయకులు పాల్గొని అభినందనలు తెలిపారు.

పర్యావరణాన్ని రక్షించుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐటిసి ఎమ్మెస్కె, ఎస్ఈఏఆర్‌సిహెచ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ద్వామా వారి సహకారంతో పంచాయతీ కార్యదర్శి విజయసారథి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల మండలం ముత్తయపాలెం గ్రామంలో ఘన వ్యర్థాలు నిర్వహణ షెడ్ దగ్గర, సచివాలయ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అందరూ కూడా తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని దీని ద్వారా కార్బన్ డయాక్సైడ్ తగ్గించాలని చెప్పారు. ఈ కార్యక్ర మంలో ఎస్. ఈ. ఏ. ఆర్. సి. హెచ్ సిబ్బంది ప్రోగ్రామ్స్ హెడ్ నాగరాజు, పీసీవో కృష్ణ, సీఓ అరుణ్, పంచాయతీ కార్యాలయం సిబ్బంది, గ్రామస్తులు, హరిత రాయబారులు తదితరులు పాల్గొన్నారు.

వేగేశనకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల : నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో విజయం సా ధించిన వేగేశన నరేంద్ర వర్మ రాజుకు బాపట్ల పార్లమెంట్ యువత ఉపాధ్యక్షుడు ఆడే వంశీ, బాపట్ల యువ నాయకు లు ఐనంపూడి షాలెం రాజు, ఎస్. రాజేంద్రలు పారీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూలమాలలు దృశాలువాలతో సత్కరించి స్వీట్లు పెట్టారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర - వేటపాలెం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ శాసనసభ్యులు మద్దు లూరి మాలకొండయ్య ఆయన కు మారుడు గౌరీ అమర్నాథ్‌లు పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ మానవ ఆవాసానికి మానవ జీవితానికి, సకల ప్రాణుల మనుగుడకు ప్రకృతి ఎంతో ఆవశ్య కమైనదని, ప్రకృతికి జీవుల మను గడకు ఎంతో ఆత్మీయ అవినాభావ సంబంధం ఉందన్నారు. మనం పీల్చే గాలి నుండి తాగే ప్రతి నీటి చుక్కను ప్రతిదీ ప్రకృతి నుండి మనకు లభించినదేనని, ప్రకృతి లేనిదే జీవుల మనుగుటలేదన్నారు. జీవుల మనుగు డ లేనిదే మానవ మనుగుడా అసలు లేదని, జీవ వైవిధ్యం దెబ్బతింటే మొత్తం సృష్టికి ప్రమాదం ఏర్పడు తుందని, పెరుగుతున్న జనాభా తరుగుతున్న వనరులు తద్వారా మనిషికి అత్యాశకు స్వార్థం మదిరి ప్రకృతిలోని సమతుల్యతను దెబ్బతీ స్తుందన్నారు. కార్బన ఉద్గారాల వినియోగం రోజురోజుకు పెరుగుతూ ఉందని అడవుల ధ్వంసం చెట్లను నరికి వేయడం ఎక్కువగా జరుగుతూ ఉండడం వలన ప్రకృతిలో తగినంత మోతాదులో ఆక్సిజన్ శాతం తగ్గిపో యి మనకు వివిధ రోగాలకు కారణ మవుతోందన్నారు. ఆ ప్రభావం పంటల మీద కూడా పడుతూ ఉందని ఆవశ్యకతను గుర్తించి ప్రతి మనిషి పది మొక్కలకు తగ్గకుండా పెంచడం అలవాటు చేసుకోవాల న్నా రు. ఇంటి చుట్టూ వనం ఊరంతా ఉద్యానవనంలా తయారు చేసుకొని తిరిగి మనం ప్రకృతితో స్నేహం చేస్తూ ప్రకృతికి తగిన జీవజాలాను మనం అందించడానికి సంపూర్ణ సహాయం చేయడానికి మనమందరం కృషి చేయాలన్నారు. గతంలో పర్యా వరణం శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా 33 శాతం అడవులు ఉండేది క్రమక్ర మంగా వర్షపాతం వల్ల మడ అడవు లు చాలావరకు తగ్గుముఖం పట్టేవని కొన్నిచోట్ల చెట్లను నరకడం వివిధ రకాలుగా కలపను వాడుకోవడం మా నవుడికి పరిపాటిగా మారిందన్నారు. ప్రకృతిని ప్రేమించడం ప్రతి ఒక్కరు కర్తవ్యంగా భావించి పర్యావరణానికి తగినంత స్వేచ్ఛను మనం కల్పించినట్లయితే కన్నతల్లిలా ప్రకృతి మనలను మన జీవితాలను జీవుల మనుగడను కాపాడుతుందని ఆయన అన్నారు.

చెత్తను తొలగించండి మహాప్రభో...?

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె - పెనుమూడి రహదారి మార్గంలో ఇటీవల నూతనముగా మున్సిపల్ పాలకులు నిర్మించిన రాణి సత్రం ఎదుట చాలా రోజులుగా చెత్త కుప్పలు పేరుకు పోయి దుర్గంధం వెదజల్లటంతో స్థానికులు చెత్తను నిప్పంటించి తగలబెడుతున్నారు. అనేక మార్లు మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి, అధికారులకు తెలియజేసినప్పటికీ రాణి సత్రం ఎదుట పేరుకుపోయి ఉన్న చెత్తను తొల గించ డంలో అలస్యం జరగడంతో ఆయా వార్డు లోని స్థానికులే చెత్తకుప్పలను తగులబెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసు కుంటున్నారు. నిత్యం ఈ రహదారి మార్గంలో వందలాది వాహనాలు, పాదచారులు నడిచి వెళు తూ ఉంటారు. వ్యర్థ పదార్థాల నుండి చెత్త నుండి విపరీతమైన దుర్గంధం వెదజల్లుతూ ఉండటంతో మున్సిపల్ అధికారులకు పట్టించు కోకపోవ డంతో స్థానికులే వ్యర్థాలను చెత్తను తగ లబెట్టి తొలగించే చర్యలు చేపట్టడం హర్షణీయం.

కోన పీఏ బెదిరింపులు వైసీపీతో ముడిపెట్టొద్దు

- ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పి.ఎ కిషోర్ మీడియా మిత్రులను బెది రించిన విషయాన్ని వైసీపీతో ముడిపెట్ట వద్దని ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోనా రఘుపతి అనుచరుడిగా ఉన్న పి.ఏ కిషోర్ తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని ఓ టివి ఛానల్ విలేకరి అతని గురించి బ్లూ బుక్‌లో పేరు నమోదు చేస్తా అని బెదిరించినట్లు కొన్ని సామాజిక మాధ్య మాల ద్వారా బహిర్గతం చేశాడన్నారు. ఈ క్రమంలో వైసీపీ పార్టీని కొంచం కించ పరిచే విధంగా చెప్పటం భాధాకరమని ఎంపీటీసీ తాండ్ర అభిప్రాయపడ్డారు. పది సంవత్సరాల క్రితం ఆఫీసు పని కోసం టైపిస్ట్‌గా వచ్చిన కిషోర్, కార్యకర్తల కష్టం మీద వచ్చిన అధి కారాన్ని అడ్డం పెట్టుకొని కోన రఘుపతికి బినామీగా ఆస్తులు పోగేసుకుని అధికార అండదండలతో అంద రిని బెదిరించే స్థాయికి వెళ్ళటం సిగ్గు చేటన్నారు. అసాంఘిక కార్యకలాపాలను దయచేసి వైసీపీతో ముడిపెట్టవద్దు అని మీడియా మిత్రులను బాపట్ల ప్రజలను కోరారు. పి.ఏ కిషోర్ దగ్గర ఉన్న బ్లూ బుక్‌తో పాటు అన్ని రకాల బినామీల బుక్‌లు కూడా బయటకు తీసే క్రమంలో నిజమైన వైసీపీ కార్యకర్తలు, నాయకులు కూడా వైసీపీకి చెడ్డ పేరు రానీయకుండా సహకరిస్తామన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ నిఘా

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసి నప్పటికీ ముందస్తు చర్యలో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సమ స్యాత్మక ప్రాంతాలు, గ్రామాలలో పోలీసుల నిఘా కొనసాగుతుంది. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఆదేశాలతో ఎన్నికల కౌంటింగ్ ముందు రోజు నుండి ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్స్ కొనసాగుతున్నాయి. ఎటువంటి ఘర్షణలు చెల రేగకుండా ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ సమస్యాత్మక ప్రాంతా లలో నిఘా ఉంచారు. గ్రామ ప్రజలతో సమా వేశాలు నిర్వహిస్తూ ఎవరైనా ఘర్షణలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీస్ శాఖ తీసుకునే కఠినమైన చట్టపరమైన చర్యల గురించి వివరించి, ఎవరూ కూడా చట్టాన్ని అతిక్రమించవద్దని సూచిస్తున్నారు.

గన్నవరంలో టీడీపీ విజయయాత్ర

విశాలాంధ్ర - యద్దనపూడి : సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు 24 వేల ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకొని యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో మండల తెదేపా అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి ఆధ్వర్యంలో బుధవారం నాడు భారీ విజయ యాత్ర జరిగించి. ఈ యాత్రలో కార్యకర్తలు, నాయకులు బాణాసంచా కాలుస్తూ గ్రామం బజార్లలో భారీ ఊరేగింపు జరిపారు. ఈ ఊరేగింపులో జడ్పిటిసి లక్ష్మీనారాయణమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్ కుమార్, యువ నాయకుడు సోమేపల్లి సుబ్బారావు, ధూళిపాళ్ళ సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ ధూళిపాళ్ళ హరిబాబు, కాస రామకృష్ణ, లోకేష్ రెడ్డి, ఆరే రాఘవరెడ్డి, చెరుకూరి సురేంద్ర, ప్రత్తిపాటి రాజేష్, వంజా బాబు, వేల్పుల వీణస్వామి, ప్రత్తిపాటి వేణు, ఖాజా వలి, ఫరాన్ అహమ్మద్, చెరుకూరి వేణు, కాకాని ఏసోబు మహిళా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.